వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- బీసీఎం కంటి దవాఖాన వ్యవస్థాపకులు డా.రాజలింగం, రీట బహదూర్‌షా
- 40 మందికి ఉచితంగా ఆపరేషన్

ఆపరేషన్ అనంతరం రోగులతో బీసీఎం వ్యవస్థాపకుడు డా.రాజలింగం

బోయినపల్లి, నవంబర్ 11: కంటి సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలందరూ కొదురుపాక బీసీఎం కంటి దవాఖాన కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీసీఎం దవాఖాన వ్యవస్థాపకులు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా. రాజలింగం-రీట బహదూర్‌షా దంపతులు చెప్పారు. కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 40 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. సోమవారం వారందరికి కంటి పరీక్షలు చేశారు. తీవ్ర కంటి సమస్యలతో బాధపడుతున్న మరో 40 మందికి కంటి పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన కంటి ఆపరేషన్ చేసుకున్న వారితో వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడవద్దని, వారి కోసమే కొదురుపాకలో కంటి దవాఖాన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణాల్లో కంటి వైద్యం చాలా ఖరీదు కావడంతో ఎంతో మంది చికిత్స చేయించుకోలేక బాధ పడుతున్నారని, అటువంటి వారు నామినల్ ఫీజు చెల్లించి ఉచితంగా కంటి పరీక్షలు చేసుకోవచ్చునని చెప్పారు. ఇప్పటి వరకు బీసీఎం కంటి దవాఖానలో 1,462 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని కంటి వైద్య సేవలు ఇంటింటికీ విస్తృతం చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వారి వెంట డా.ఉమ, డా. బిల్ల అనూషరెడ్డి, రిషబ్ మేనేజర్ ధారవేణి తిరుపతి, విజన్ పరీక్షకులు అన్వేష్, కౌన్సిలర్ పయ్యావుల రాజు, ఓటి సిబ్బంది బిజి, చంద్రయ్య,రాజు, సత్య, రాజు, పావణి, రమేశ్ ఉన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, నవంబర్ 11: స్వాతంత్ర సమర యోధుడు, భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్ హాజరై అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, వెంకట్ ఉపేందర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాధాభాయ్, ఓఎస్డీ సర్వర్ మియా పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లపై ఉక్కుపాదం

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టరేట్ ధర్నా
- బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సిరిసిల్లలో గంటపాటు ఉద్రిక్తత



సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ సర్పంచులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లుల కోసం సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా రిలేదీక్షలు చేసిన జిల్లాలోని సర్పంచులు, సోమవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. మొదట ప్రజావాణిలో ఉన్న కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లారు. పెద్దసంఖ్యలో వస్తున్న విషయం పోలీసులు తెలుసుకొని, కలెక్టరేట్ గేట్లకు తాళం వేశారు. దీంతో మాజీ సర్పంచులు గేటు ఎదుట బైఠాయించారు. గంటకుపైగా ధర్నా చేశారు. చేతిలో ప్లకార్డులు పట్టుకుని 'రేవంత్ సర్కార్ డౌన్‌డౌన్' అంటూ నినదించారు. గేటు ఎదుట కొంత మంది పడుకుని నిరసన తెలిపారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులను కలెక్టరేట్‌లోనికి వెళ్లనియ్యక పోవడంతో పోలీసులు అక్కడి నుంచి లేపే ప్రయత్నం చేశారు. గ్రామాభివృద్ధి కోసం తాము అప్పులు తెచ్చి పనులు చేసినా సర్కారు బిల్లులు ఇవ్వడం లేదని, తాము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఆందోళన చేస్తున్నామని మాజీ సర్పంచులు వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదంటూ మొండికేశారు. కనీసం కలెక్టర్‌ను కలిసి తమ బాధలు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు అనుమతించకపోవడంతో కొందరు గేటు ఎక్కి కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు, ఆందోళన కారుల మధ్య తోపులాట జరిగింది. గంటపాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బైఠాయించిన వారిని లాక్కెళ్లి వ్యాన్‌లో ఎక్కించారు. దాదాపు 60 మందిని అరెస్టు చేసి తాడూరులోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు.

మాజీ సర్పంచ్‌ను లాక్కెళ్తున్న పోలీసులు

సీఎం కక్షసాధింపు చర్యలు

బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై సీఎం రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడంటూ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కనపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి ఆరోపించారు. గ్రామ పంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, వైకుంఠ దామాలు, డంప్ యార్డులు, క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్ భగీరథ, కమ్యూనిటి భవనాల లాంటి అభివృద్ధి పనుల కోసం రూ.లక్షల అప్పులు తెచ్చామని తెలిపారు. సకాలంలో బిల్లులు రాకున్న టార్గెట్ పూర్తి చేయాలన్న ఉద్దేశంతో పూర్తి చేశామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నపుడు అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు ఇప్పిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు అడిగితే అరెస్టులు చేస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో రూ. వేల కోట్లు అభివృద్ధి, సంక్షేమాల కోసం ఖర్చుచేస్తున్న ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులపై స్పందించడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, చాకలి రమేశ్, వెన్నమనేని వంశీకృష్ణ, కోల నర్సయ్య, గున్నాల లక్ష్మణ్, చల్ల నారాయణ, బూర్గుల నంద య్య, గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, కీర్తిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో గంగపుత్రుల ధర్నా

ధర్నా చేస్తున్న గంగపుత్ర కులస్తులు

గంభీరావుపేట, నవంబర్ 11: చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై గంగపుత్ర సంఘం సభ్యులు సోమవారం ధర్నా చేశారు. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుతోపాటు చెరువుల్లో ఇప్పటికీ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వానకాలంలో ప్రాజెక్టు, చెరువుల్లోకి 50 శాతం నీరు రాగానే సర్వే చేసి ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసేదని గుర్తు చేశారు. ప్రస్తుతం చెరువులు నిండుకుండలా ఉన్నాయని, నవంబర్ వచ్చినా ఇప్పటి వరకు చేపపిల్లలు ఎందుకు పంపిణీ చేపట్టలేదంటూ సీఎంతోపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంగపుత్రులను చిన్న చూపు చూస్తున్న రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసే వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మత్స్యకార సంఘం మండలాధ్యక్షుడు కరువారి శంకర్, మండల గంగపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



చైర్‌పర్సన్ కళను సన్మానిస్తున్న పౌర సంక్షేమ సంస్థ సభ్యులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళను సోమవారం సిరిసిల్ల పౌర సంక్షేమ సంస్థ సమితి సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠధామంలో రూ.101కే అంత్యక్రియలు నిర్వహించా లని మున్సిపల్ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ పౌర సంక్షేమ సమితి సభ్యులు, మున్సిపాల్ పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

ఇది కొమురం భీమ్ స్ఫూర్తి

- ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు

విద్యానగర్, నవంబర్ 11 : కొడంగల్ నియోజకవర్గంలో రైతులు చేసిన తిరుగుబాటు కొమురం భీమ్ స్ఫూర్తి, పోరాటాన్ని గుర్తుకు తెస్తుందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది అస్తిత్వ పోరాటమని, దాని ముందు ఏ శక్తులూ పనిచేయవని చెప్పారు. ఏ ప్రభుత్వ అణచివేత పనిచేయదని, ఎంత అణచివేస్తే పోరాటం అంత ఉగ్రరూపం దాల్చుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆలోచనల్లో మార్పు రావాలని, ఫార్మాసిటీ ఏర్పాటుకు స్వస్తి చెప్పాలని, రైతులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రభుత్వం అంటే ప్రజలను అణచివేయడం, భయభ్రాంతులకు గురిచేయడం కాదని, ప్రజల పక్షాన నిలబడి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చూడాలని పేర్కొన్నారు.

'గ్రీవెన్స్ డే'తో బాధితులకు సత్వర న్యాయం

తెలంగాణ చౌక్, నవంబర్ 11: బాధితులకు సత్వర న్యాయం చేసేందుకే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుచి వచ్చిన అర్జీదారుల నుంచి 17 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు విధులుండాన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వార్డులు పర్యటిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐలు శ్రీకాంత్, రమేశ్, రాజు, శ్రీకాంత్ ఉన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, నవంబర్ 11 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సోమవారం రామోజీపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్, బ్యాంకు లింకు ఉన్న ఫోన్ ఇవ్వకూడదన్నారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పవద్దన్నారు. గ్రామాల్లో యువత గంజాయికి ఆకర్షితులవుతున్నారని, తల్లితండ్రులు గమనించి సన్మార్గంలో పెట్టాలని సూచించారు. మూఢ నమ్మకాలు, 100 డయల్‌పై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్లో తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్లో మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

భగత్‌సింగ్ ఓ ఉగ్రవాది: పాక్

లాహోర్: బ్రిటిష్ వలస పాలకులపై వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ పట్ల పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రభుత్వం దురహంకారంతో వ్యవహరించింది. ఆయనను గౌరవించేందుకు తిరస్కరించింది. షడ్మన్ చౌక్‌కు భగత్ సింగ్ పేరు పెట్టడాన్ని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించింది. భగత్ సింగ్‌ను ఉగ్రవాదిగా పేర్కొనడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఘాటుగా స్పందించింది. దీనిపై పాకిస్థాన్‌ను వివరణ కోరాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బీజేపీ స్పందిస్తూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న విషయం అందరికీ తెలుసునని పేర్కొంది. భగత్ సింగ్‌ను అపఖ్యాతిపాలు చేయడం కోసం పాకిస్థాన్ నయవంచనకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.



హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవ